క్లుప్తంగా

దేవాలయాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

తుని: కార్తిక మాసం సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పలు దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు పంచారామ క్షేత్రానికి, ప్రతిరోజూ ఉదయం 05.30 గంటలకు శ్రీశైలానికి, ప్రతి శనివారం ఉదయం 05.15, 06.15 గంటలకు వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. టిక్కెట్లను స్వయంగా రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ నెల 25, వచ్చే నెల 24న అరుణాచలం గిరి ప్రదర్శనకు తుని నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు ఉంటుందని, పంచారామ క్షేత్రాలు, శబరిమలకు భక్తులు కోరుకున్న ప్రదేశం నుంచి తక్కువ ధరకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నామన్నారు. టికెట్ల వివరాలకు 7382913216, 7382921904, 7382913016 నంబర్లను సంప్రదించవచ్చని డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు నజరానా

తుని: ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్నామని తుని డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. తుని-నర్సీపట్నం, కోటనందూరు- కాకినాడ రూట్లలో తిరిగే బస్సుల్లో గిఫ్ట్ బాక్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు టికెట్ వెనుక చిరునామా, ఫోన్ నంబరు రాసి బాక్సులో వేయాలని సూచించారు. నెలలో రెండు సార్లు పెద్దల సమక్షంలో డ్రా తీసి గెలిపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేస్తామన్నారు. పెద్దవీధిలోని ఉమాశంకర్ వస్త్రలత యాజమాన్యం గిఫ్టులు అందిస్తుందన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడికి నివాళి



వెంకటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ నేత, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు సామంతుల వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. స్థానిక సహకార సంఘ భవనంలో సీఈఓ జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహకార సంఘ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు అందించిన సేవలను కొనియాడారు. సిబ్బంది ఆదినారాయణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుల ఆందోళన

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం అకాల వర్షం కురవడంతో ఖరీఫ్ రైతులు ఆందోళన చెందుతున్నారు. పీబీసీ, పంపా, వ్యవసాయ బోర్లు, చెరువుల పరిధిలో మండల వ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిపంట సాగు చేశారు. ఇప్పటి వరకూ దాదాపు వ్యవసాయబోర్ల పరిధిలో వెయ్యి ఎకరాల వరి పంటను కోత కోశారు. కాగా మిగిలిన పంట అంతా కోత దశలో ఉంది. ఈ సమయంలో వర్షం కురవడం వల్ల పనలపై ఉన్న పంటి తడిసి నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సారా స్థావరాలపై దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలో మంగళవారం సారా స్థావరాలపై సెబ్ సిబ్బంది దాడి చేసి, ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కేసులో నిందితుడు మోర్త బాబ్జి పరారయ్యాడన్నారు.దీనిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

అచ్చంపేటలో ఫ్యామిలీ డాక్టర్

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యం ప్రజలకు చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. అచ్చంపేట గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. ప్రస్తుతం తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు.

మద్యం అక్రమ తరలింపుపై 9 కేసులు

కాకినాడ క్రైం: జిల్లా వ్యాప్తంగా పలు సెబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో నాటుసారా, బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజా దాడుల్లో 38 లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి తొమ్మిది కేసుల్లో 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు తెలిపారు. సబ్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్టు తెలిపారు.



మురారిలో ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



తుని సీతారాంపురం సచివాలయం వద్ద ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సీపీ సుధారాణి, నాయకులు



కేపీ మల్లవరంలో సంక్షేమ పథకాల జాబితాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్



తుని చేరుకున్న జయకుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జగన్ పాలనలో ఇంటింటా సంక్షేమం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్

గోకవరం: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారం రావాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. స్థానిక సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధిని ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ, బీసీ కమ్యూనిటీ భవనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, నాయకులు బాబి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జె.కొత్తూరు గ్రామంలో సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామానికి జరిగిన సంక్షేమం, అభివృద్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని, వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ రాజా, సర్పంచి నాగేశ్వరరావు, ఎంపీడీఓ వసంతకుమార్ నాయకులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: భూపాలపట్నంలో వైఎస్సార్ సీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, దోమాల గంగాధర్, బొజ్జపు శ్రీను, కొఆప్షన్ సభ్యులు మీకా, సచివాలయం సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రానికి సీఎంగా మళ్లీ జగనే కావాలి

తుని: పట్టణంలోని 5, 6 వార్డులకు సంబంధించి 3వ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సచివాలయం వద్ద పార్టీ జెండాను ఎగుర వేసి, నాలుగున్నర ఏళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ హయాంలో జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు మర్రా సత్యవతి, సూరిశెట్టి సుభద్రాదేవి, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కేపీ మల్లవరంలో..

కోటనందూరు: కేపీ మల్లవరంలో సర్పంచ్ వేముల సత్యవేణి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ లగుడు శ్రీనివాసు పార్టీ నాయకులతో కలసి సంక్షేమ పథకాల జాబితా, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ ఉమారావు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని యాత్ర

తుని: సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ ప్రకాశం జిల్లా ఆదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం సాయంత్రం తునికి చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను జయకుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సెప్టెంబరు 12న కడప జిల్లా ఇడుపులపాయలో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి యాత్రకు ప్రారంభించానని, వచ్చే నెల 21వ తేదీ నాటికి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం చేరుకుని ముగిస్తామన్నారు. 70వ రోజు తుని చేరుకున్నాని చెప్పారు. తుని నియోజకవర్గంలోని మూడు మండలాల్లోను యాత్ర నిర్వహించి జగన్ హయంలో జరిగిన మేలును ప్రజలకు వివరిస్తున్నట్టు ఆయన తెలిపారు. తునికి చేరిన జయకుమార్‌కు పలువురు నాయకులు స్వాగతం పలికారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం

గండేపల్లి: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని మురారిలో మంగళవారం గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్టు తెలియజేశారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చడం మరిచారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన మాటను, ఇచ్చిన హామీలను నెరవేర్చినట్టు తెలిపారు. ముందుగా పార్టీ జెండాను, ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచ్‌లు కందుల చిటిబాబు, బుద్దరాజు గణపతిరాజు, ఎంపీడీఓ రామన్, పంచాయితీ కార్యదర్శి పి వీర శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. చీడికమ్మతల్లి జాతరోత్సవం

- అమ్మవారిని దర్శించిన వేలాది మంది భక్తులు
- అలరించిన దైవతామూర్తులు, శక్తివేషాలు

తుని రూరల్: కేఓ మల్లవరం గ్రామదేవత చీడికమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. సోమవారం రాత్రి జాగరణ, మంగళవారం అమ్మవారి దర్శనం, తీర్థం, ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక, జానపద, సాంఘీక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉదయం అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం వారిచే బుర్రకథ, హైదరాబాద్, గుంటూరు, రాజమండ్రి వారిచే సినీ డూప్ డ్యాన్స్, జబర్దస్, ఢీ కళాకారులచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, శ్రీకృష్ణ కళా బృందంతో తోలుబొమ్మలాట, కూచిపూడి, జానపద, కోలాటం నృత్యాలు జరిగాయి. కళ్లు మిరమిట్లు గొలుపే విద్యుత్ దీపాలంకరణలు, దద్దరిల్లే బాణసంచా పేలుళ్లు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు శక్తివేషాలు, అష్టలక్ష్మీ వేషధారణలు, తప్పెటగుళ్లు, బాజా భజంత్రీలు, డప్పు డ్యాన్స్‌లతో ఉత్సవాలు హోరెత్తాయి. గ్రామదేవత పండగ కావడంతో వేర్వేరు పట్టణాల్లో ఉన్న ఆడపడుచులు, అల్లుళ్లు, బంధువులు రాకతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామ సర్పంచ్ డొంక సత్యవతి, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు డొంక వెంకట బెనర్జీ, కేఓ.మల్లవరం, రాపాక, దొండవాక, ఆర్ఎస్.పేట, సీహెచ్. అగ్రహారం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చీడికమ్మతల్లి తీర్థంలో కళాకారుల ప్రదర్శన



చీడికమ్మతల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

గోకవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన రహదారిపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి, వీరలంకపల్లి గ్రామాల వద్ద ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మంగళవారం బ్లాక్ స్పాట్స్ వద్ద రేడియం ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బ్లాక్ స్పాట్స్ వద్ద డ్రమ్ములనుని ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు భద్రతా ప్రమాణాలను, నిబంధనలను పాటించాలన్నారు.



వీరలంకపల్లి వద్ద ప్రధాన రహదారిపై డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



కార్యక్రమంలో బహుమతులతో విద్యార్థులు

గోకవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించకొని స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక సచివాలయం కార్యాలయం ఆవరణలో లైబ్రేరియన్ కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ చిమ్మరాజుదొర, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ అభివృద్ధి చైర్మన్ బద్దిరెడ్డి అవతార్‌మెహర్‌బాబా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని గత వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

7,173 మంది ఓటర్లకు నోటీసులు

ప్రత్తిపాడు: నియోజకవర్గ పరిధిలో ఒకటి కంటే ఎక్కువ సార్లు ఓటర్లగా నమోదైన 7,173 మందికి నోటీసులు ఇవ్వనున్నట్టు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బూత్ లెవెల్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని 67 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటరు జాబితా ప్రకారం ఫొటో సారూప్య ఎంట్రీలు (ఫొటో సెమిలర్ ఎంట్రీస్ పీఎస్ఈ), డెమోగ్రఫికల్ సారూప్య ఎంట్రీలు (ఫొటో సారూప్య ఎంట్రీలు-డీఎస్ఈ)లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఒకటి కంటే ఎక్కువ సార్లు ఓటరుగా నమోదై ఉన్నవారు 942 మంది, నియోజకవర్గంలో ఉన్న 2,072 మంది ఓటర్లు వేరే పోలింగ్ కేంద్రాల పరిధిలోనూ, నియోజకవర్గంలోని 4,349 మంది ఓటర్లు ఇతర నియోజకవర్గాల ఓటరు జాబితాలో నమోదు కాగా ఒక చోట కంటే ఇతర ప్రాంతాల్లో మొత్తం 7,363 మంది ఓటర్లను గుర్తించామన్నారు. వీరిలో ఎక్కడ ఓటు హక్కును కోరుకుంటారో తెలియజేయాలంటూ 7,173 మందికి నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిపారు. 190 మంది ఓటర్ల ఓటును సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉంచామన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల) టి శ్రీనివాసరావులతో పాటు మండలంలోని పోలింగ్ బూత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఓటర్లకు ఇచ్చే నోటీసులపై చర్చించారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె శ్రీనివాసరావు, ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ప్రత్తిపాడు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శేరు కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా రవిసాగర్



రవిసాగర్, జాషువాగిరిలను సన్మానించిన వైస్ఎంపీపీ గంగబాబు

తొండంగి: కొమ్మనాపల్లిలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బండి రవిసాగర్ నియామకమయ్యారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ, ఇతర నాయకుల సమక్షంలో వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జాషువాగిరి మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బండి రవిసాగర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మైనార్టీల ప్రయోజనాల కోసం కృషి చేస్తానని రవిసాగర్ అన్నారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు కలిసి జాషువా గిరి, రవిసాగర్‌లను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు గాబు రాజు, దడాల విజయ్, కోన సూర్యనారాయణ, మండల సమన్వయకమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, యు.రవివాకర్, బండి అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నగర సంకీర్తన



ధర్మవరంలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: కార్తిక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ధర్మవరం, ఉత్తరకంచి, ఒమ్మంగి, రాచపల్లి, శరభవరం, గజ్జనపూడి తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున గోమాతతో గ్రామాల్లో సంచరిస్తూ పలు కీర్తను ఆలపిస్తున్నారు.

కుల గణన పారదర్శకంగా చేపట్టాలి

ప్రత్తిపాడు: మండలంలో ఈనెల 27వ తేదీ నుంచి వారం రోజుల పాటు చేపట్టనున్న కులగణన పారదర్శకంగా జరగాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కులగణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఎంపీడీఓ మాట్లాడుతూ కులగణన సమయంలో ప్రజలంతా గ్రామంలో ఉండేలా ముందుగా సమాచారమివ్వాలన్నారు. ఈశిక్షణ తరగతులకు మాస్టర్ ట్రైనీగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ కుల గణనపై ముందుగా వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గృహస్తుల నుంచి బయో మెట్రిక్, ఐరీస్, ఓ.టి.పి., ఫేషియల్ ద్వారా సిబ్బంది కుల గణనకు నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బందికి కుల గణనపై తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, మండల పరిషత్ పరిపాలనాధికారి జె.శ్రీనివాసు, కులగణన సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రత్నగిరి ఈఓ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ మంగళవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్తికమాసంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యేకు వివరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పర్వత కోరారు.

ఈఓను కలిసిన ప్రముఖ వ్యాపారవేత్త సత్యప్రసాద్

ప్రముఖ పారిశ్రామిక వేత్త, సత్యదేవునికి వజ్రకిరీటం తయారు చేయించిన దాత, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ మంగళవారం అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈఓకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ త్వరలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కూడా వజ్రకిరీటం తయారు చేయిస్తున్నట్టు తెలిపారు. వీలైతే ఈ కార్తిక మాసంలోనే అమ్మవారికి వజ్ర కిరీటం తయారు చేయించి సమర్పిస్తానని సత్యప్రసాద్ సాక్షికి తెలిపారు. దాత సత్యప్రసాద్‌ను ఈఓ అభినందించారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్

నయనానందం.. జ్యోతిర్లింగ దర్శనం..

తుని రూరల్: కార్తికమాసం పర్వదినాలను పురస్కరించుకుని వి.కొత్తూరులో ద్వాదశ జ్యోతిర్లింగాల (నమూనాలు) ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మంగళవారం తుని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో వి.కొత్తూరు అచ్యుతా పబ్లిక్ స్కూల్ సమీపంలో టి.రామకృష్ణ నివాసంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తుల సందర్శనార్థం ఉంచారు. ఈ జ్యోతిర్లింగాల ప్రదర్శన ఈ 28వ తేదీ వరకూ ఉంటుందని బ్రహ్మకుమారీలు తెలిపారు. ఈనెల 23న ఏకాదశి పర్వదినం రోజు ప్రపంచ రహస్యాలు చిత్రాన్ని ప్రదర్శిస్తామన్నారు. 27న కార్తిక పౌర్ణమి పర్వదినాన దీపారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించి, ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. 29 నుంచి వారం రోజులు ప్రతిరోజు సాయంత్రం ఏడు గంటలకు ఉచిత రాజయోగ (మెడిటేషన్) తరగతులు నిర్వహించనున్నట్టు వివరించారు. పలువురు భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించి, పూజలు చేశారు. బీకే మాధవీలత, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, భక్తులు కిల్లి శ్రీనివాస్, రొంగల సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత, లాయర్ సత్యనారాయణరాజు, బీకే.వాసవి తేజ పాల్గొన్నారు.



మల్లికార్జునుడు (ఏపీ)



కేదారేశ్వరుడు (మహారాష్ట్ర)



ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటున్న భక్తులు

నిరుపయోగంగా వ్యాయామ పరికరాలు

ఏలేశ్వరం: శరీరదారుఢ్యంతోపాటు ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీనిపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నగర పంచాయతీకి ప్రభుత్వం వ్యాయామ పరికరాలు మంజూరు చేసింది. వీటిని షిర్డినగర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలోని పార్కులో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. సుమారు మూడేళ్లవుతున్నా ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. దీంతో అవి తుప్పు పట్టి పాడైపోతున్నాయి. దీంతోపాటు కొన్ని పరికరాలు చోరీకి గురయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వాటిని వాడకంలోని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



వ్యాయామ పరికరాలు